# మరలి వచ్చిన మైత్రి

"సాయంత్రం తొందరగా వచ్చేస్తావుగా?" అనడిగింది పద్మావతి మెట్ల పైనుంచి.

"ఐదులోపే వచ్చేస్తా. మీరు రెడీగావుండాలి నే వచ్చేసరికి". అన్నది మాలతి క్రిందనుంచి.

తన రిక్షా కదిలి రోడ్డు మలుపు తిరిగేవరకు ఆవిడక్కడే నిలబడి చూస్తుందని తెలుసు మాలతికి.

రోజూ ఆఫీసుకు వెళ్ళే ముందు అక్కడ దిగి ఆవిణ్ణి పలకరించి, కాస్సేపు కూర్చుని, ఆవిడ పొట్లం కట్టిచ్చే టిఫిను తీసుకుని వెళ్ళడం అలవాటు. 'నువ్వు మా యింట్లో వుండిపోరాదా?' అనేది ఆవిడ-ఆయనా అల్లాగే అంటారు. కానీ - తనే ఎందుకనో ఆ రూము వదిలి రావాలనిపించక, వూరుకుంది. ఆ కారియరు అన్నం ఎవరికీ సయించనిది, తనకి బాగానే వుంటుంది.

ప్రొద్దున్న తను వెళ్ళేసరికి, ఆయన, పిల్లలు స్కూలుకి వెళ్ళిపోతారు. తను కూర్చునే పదినిముషాల్లో ఎంతోమందిని గురించి ఎన్నో విషయాలు చెప్పుకుంటారు.

పద్మావతి కూడా చదువుకున్నది.

మాలతి హైదరాబాదులో ఉద్యోగంలో చేరిన క్రొత్తలో, రూముకోసమని తిరుగుతూ, వాళ్ళింటి కొచ్చి అడిగింది. ఆవిడే తీసుకెళ్ళి, ఆ యింటివాళ్ళకి తనని పరిచయం చేసి, రూము యిప్పించింది. తను తంటాలుపడి వంటచేసుకుంటుంటే కారియరు ఒకటి కొనిపించి,

హోటల్నుంచి ఆయనతో టిక్కెట్ల పుస్తకం తెప్పించి, పనిమనిషిని కూడా ఏర్పాటుచేసిపెట్టింది పద్మావతి.

ఇప్పటికి ఏడాదౌతుంది తనీ ఉద్యోగంలోచేరి, పద్మావతితో స్నేహంచేసీ. ఆలోచనల్లోంచి తెప్పరిల్లి గడియారం చూసుకుంది మాలతి. టైము కావస్తోంది. 'కొంచెం తొందరగా పోతావు?' అని రిక్షావాడిని హెచ్చరించింది. పై నెలలోనే దసరా వస్తూవుంది. దసరా నాటికి తను చీర కొనుక్కుని, అమ్మకి కూడా ఒక మంచి చీర కొని పంపించాలనుకుంది. అమ్మకి పంపిస్తే బాగుంటుందన్న ఆలోచన పద్మావతిదే. పద్మావతికి కూడా తను కొనుక్కున్న మాదిరి చీరే కొనివ్వాలని మాలతి అనుకుంది లోపల.

సాయంత్రం పెందరాళేవస్తే, బజారుకి వెడదా మంది పద్మావతి.

రిక్షా ఆఫీసు గేటులో ప్రవేశించింది. మేనేజరు వాడేకారు అక్కడే వుంది. 'మాధవరావు వచ్చేశారన్నమాట' అనుకుంది.

రిక్షావాడికి డబ్బిచ్చేస్తోంటే "హల్లో" అన్న మాధవరావు కంఠం వినిపించింది. మాలతి "నమస్కారమండీ" అన్నది.

కారు ఎక్కి, ఒక్కసారి నవ్వి, వెళ్లిపోయాడతను. అతని కారు వేగంగా గేటుదగ్గర తిరుగుతుంటే, తల తిప్పిచూసింది మాలతి.

రోజంతా పనిలో గడిచింది. తను రాసే ఫైల్సు ఒక్కొక్కటీ పంపిస్తోంటే, కొన్ని తిరిగివస్తున్నాయి, మాధవరావు దగ్గర్నుంచి. తను వ్రాసిన వాటిల్లో దిద్దుబాట్లు చేసినవి కూడ తనదగ్గరకే పంపిస్తున్నాడతను. తనకి కొన్ని సూచనలు వున్నాయి వాటిల్లో.

ఒకచోట కాగితంలో ఒక మూల సన్నని అక్షరాల్లో అతని సంతకం వుంది. ఆ సంతకంకేసి చూస్తూవుండిపోయింది మాలతి. మొదటిరోజు తను ఆ సంతకం చూసి, ఏమిటో అర్థంకాక, సాయంకాలం వరకు ఆగి, అతన్ని అడిగింది భిడియపడుతూ. అతను నవ్వాడు- "ఏం లేదండీ, నా సంతకం - ఆ కాగితం ఫైలు చేయొచ్చని వ్రాసి సంతకం పెట్టా" అన్నా డతను. ఆ విషయం తల్చుకుంటే మాలతి కిప్పుడు నవ్వొచ్చింది.

"మేనేజరుగారు రమ్మంటున్నారు." అని చెప్పాడు ప్యూను వచ్చి. మాలతి లేచింది. అతను పిల్చినప్పుడల్లా తన హృదయం ఏదో హాయైన అద్భుతమైన విషయాన్ని కనుక్కోబోతున్నట్లు, ఆతురతపడుతున్నట్లు ఉరకలు వేస్తుంది. తన పాదాలు నేలకి అంటడం లేదేమోనన్నట్లు అడుగులు తేలిపోతుంటాయి.

తన రాకకోసమే చూస్తున్నట్లు, మాధవరావు తలుపువంకే చూస్తున్నాడు. మాలతి అడుగులు తడబడ్డాయి - చేతులు జోడించి "నమస్కారం" అన్నది అస్పష్టంగా.

అతను నవ్వాడు - మాలతి మనస్సు ఝల్లుమన్నది. భయంతో కాదు. వింత భావనతో, పులకరింపుతో.

"ప్రొద్దున్నేగా పెట్టారు నమస్కారం? - అదిసరే, మన కంపెనీలో ఒక క్లబ్బు ఏర్పాటు చేయాలని అంటున్నారు మనవాళ్ళు, లైబ్రరీ, కొన్ని గేమ్సూ వుండాలని. ఆ విషయ మంతా మీతో విపులంగా మాట్లాడితే బాగుంటుందని నేననుకున్నాను - ఎందుకంటే కంపెనీలో చాలమంది ఆడవాళ్ళు కూడా వున్నారు కదా అని. మీరు

సాయంత్రం మా యింటికి రాగలరా ఓసారి అల్లా వెళ్లేటప్పుడు? నా కారులో వెడదాం. మళ్ళీ యింటిదగ్గర వదిలేస్తా మిమ్మల్ని."

మాలతి మాట్లాడలేదు ఒక్క నిముష మాగి "ఇప్పుడు మాట్లాడడానికి వీలుండదా?" అన్నది.

మాధవరావు ఎదురుగా గడియారంవంక చూశాడు. "కొన్ని అర్జెంటు కాగితాలున్నాయి ఈ రోజు పోస్టులో వెళ్ళాల్సినవి. ఈ విషయం నాల్గు రోజుల్నుంచీ మర్చిపోతున్నాను. అందుకని ఈ వేళ జ్ఞాపక ముంచుకొని చెప్పాను - మా యింటికి రావడం మీకేమైనా అభ్యంతరమా?"

మాలతి ముఖం ఎర్రబడింది. ఏం చెప్పాలో తోచలే దామెకు. "అల్లాగని కాదు కానీ యిప్పుడు..." అని అతనివంక చూసి ఆగి పోయింది.

అతని కళ్ళు నిశ్చలంగా తనవేపే చూస్తున్నాయి. తను చెప్పే మాటను వినడంకోసం, తనవేపు చూసేచూపు కాదది. అతని చూపుని ఎదుర్కోలేక, బరువుగా వాలిపోయాయి మాలతి కళ్ళు. నిలువలేక పోయింది.

అప్రయత్నంగా వెనక్కి తిరిగి, చకచక తన గదిలోకి నడిచి వచ్చేసింది మాలతి. ఆమె హృదయం పూవులాగా విచ్చుకుంటోంది. ఏదో సంభ్రమంగా వుంది.

పది పదిహేను నిమిషాలకి తేరుకుంది ఆమె. ఏముంది అతని చూపులో? తన యింటికి రమ్మనడంలో అతని ఉద్దేశ్యం ఏమిటి?-

మాలతిలో అణచుకోరాని ఆవేశం ఉద్భవించింది. దాచుకోలేని చిరునవ్వులు తన ముఖాన విరిశాయేమో నన్న అనుమానంతో, ఫైల్సు తీసుకునే నెపంతో, గోడవేపుండే బీరువాలోకి చూస్తూ నిలబడింది మాలతి.

ఆ సాయంత్రం పద్మావతి యింటికి చేరింది ఆమె. కాఫీ త్రాగి ముఖం కడుక్కొన్న తర్వాత 'బీరువాలోంచి ఇంకో చీరె తీసి కట్టుకో' అన్నది పద్మావతి.

మాలతి బీరువా ముందు నిలబడి, తన కిష్టమైన చీరె ఏరుకుని, అద్దం ఎదురుగా నిలబడింది. ఈ చీరెలో తనింత అందంగా వున్నదేం? మాధవరావు జ్ఞాపకానికి వచ్చాడు. అతనే జ్ఞాపకానికి వస్తున్నాడు. అతని కళ్లు-తన మనస్సులోకి చొచ్చుకొనిపోయే అతని చూపు గుర్తుకు వస్తూంది. అతని కళ్ళు ఏదో మమతతో నిండవున్నాయి. ఆ కళ్ళల్లో తనకి కనిపించి, బెదిరించి, చివరికి అర్థమైనది – ఆ లాలన. తనవేపు ఇంత ఇష్టంగా ఎవరేనా చూశారూ? టేబిలుమీదున్న సన్నజాజిదండ తీసి, తల్లో తురుముకుని, పక్కకి తిరిగి అద్దంలో ఓ మారు జడని చూసుకుంది.

"ఏమిటి? అదేపనిగా సింగారిస్తున్నావు?" అంటూ పద్మావతి లోపలికి వచ్చింది.

"ఏం చీరెలు కొందా మంటారో చెప్పండి" అన్నది మాలతి ఆమెవంక తిరిగి.

"కంచి చీరెలంటే మీ అమ్మకిష్టం అన్నావుగా?"

"అమ్మో! పెట్టలేనండీ, అంత ధర" అన్నది మాలతి.

"మరి, ఎంత పెడతావు - ఏ నెలా కోరికలు పూర్తిగా తీరవు," అన్నది పద్మావతి నవ్వుతూ.

మాలతి ఆలోచించి "ఎంత పెట్టమంటారు? - అస లల్లా కాదు. కూర్చోండి చెబుతాను. ఈ నెల నాకేమో ఎంత వచ్చిందంటే..." అంటూ మొదలుపెట్టింది.

వచ్చినజీతం, చేయాల్సిన ఖర్చులూ, ఏవి ముఖ్యమైనవి, ఏవి పై నెలకి వాయిదా వేయవచ్చు - ఇవన్నీ ఆలోచించి, కాగితం మీద వేశారు. అన్ని విషయాలూ పద్మావతి చెప్పాల్సిందే. మాలతి కేమిటో ఆమె చెప్పిన వన్నీ, తన మనస్సులో వున్న విషయాలే అన్నట్లు సరిగ్గా వచ్చుతాయి.

బజారుకెళ్ళి, పద్మావతికి నచ్చిన చీరలు మూడు కొనుక్కొచ్చారు. తొమ్మిదయింది. యింటి కొచ్చేసరికి.

"మాలతి యిక్కడే వుంటుంది."అన్నది పద్మావతి. ఆ రాత్రికి మాలతి అక్కడే వుండిపోయింది. కలల్లో మాధవరావే!

మర్నాడు ప్రొద్దున్న లేస్తూనే, తనరూముకి వెళ్ళిపోయింది మాలతి. ఆమె మనసు దేనికోసమో ఎదురుచూస్తోంది. తను ఏమిచేస్తున్నా అవే తలపులు వస్తున్నాయి. తనను అలుముకున్న సువాసనలాగా వున్నాయి అతనిని గురించిన ఆలోచనలు. తెప్పరిల్లి చూడనివ్వటం లేదు. గత ఆరు నెలల్లో అతని ప్రవర్తన తనకి బాధ అనిపించకుండా, అత నేమిచేసినా తన మనస్సుకి ఆమోదకరంగా కనుపించడానికి కారణం యిదే

కాబోలు. నిన్న అతను యింటికి రమ్మన్నందుకు తనకి నిజానికి కోపం రాలేదు. ఏదో అల్లా నిరాకరించింది.

భోజనంచేసి, పడక్కుర్చీలో కూర్చుంది మాలతి. ఇంకో అర గంట తా నిల్లా కూర్చోవచ్చు - తీయని కలల్లో.

బయట కారు ఆగడం, కారు తలుపుతీయడం, వేయడం వినిపించాయి ఆమెకి. చటుక్కున లేచి కూర్చుంది. అదే బూట్లధ్వని! త్వర త్వరగా లోపలికి వెళ్ళింది. ఏంచేయాలో తోచక అటు యిటు తిరిగింది. అద్దంలో ఒక మాటు ముఖం చూసుకుంది. బుగ్గలు ఎర్రగా వున్నాయి. పమిట కొంగుతో తుడుచుకుంది. కళ్ళు మెరుస్తున్నాయి. మళ్లీ ముందు గదిలోకి వచ్చింది. ఎదురుగా అతను!

"నమస్కారం" అన్నది ఆమె.

"హఠాత్తుగా వచ్చేశా నిల్లా, ఇంకా పైముందికదా ఆఫీసుకి?" అంటూ అతనే కూర్చున్నాడు.

"కూర్చోండి, నిల్చున్నారేం ?" అన్నాడు. ఆమె కూర్చుంది. కొంతసేపు ఎవరూ మాట్లాడలేదు.

"పోనీ, ఆఫీసుకి బయలు దేరుతారా ? వెడదాం మెల్లిగా" అన్నాడు. 'కారులో మెల్లిగా ఎలావెళ్ళడం' అనుకుంది ఆమె. పైకి అనలేదు.

తలూపి, లోపలికి వెళ్ళింది. చీరె మార్చుకుని, రెండు నిముషాల్లో వచ్చేసింది. చెప్పులు వేసుకుని, తాళం చేత్తో పట్టుకుంది.

"మీ రొక్కరే వుంటారు కదూ యిక్కడ?" అన్నా డతను. దానికి తలూపింది మాలతి. అతనితో ఏదైనా మాట్లాడా లని, అతని వంకే చూడా లనీ అనిపిస్తోంది. ఈ ఆఫీసు, టైము, నిబంధనలు - అన్నీ బాధగా, అడ్డంగా వున్నాయి.

కారులో ముందుసీటు తలుపు తీశాడతను. ఆమె వెళ్ళి వెనక సీటులో కూర్చుంది. కారు నడుపుతున్నా డతను. "మీతో ఒక విషయం చెప్పాలని వచ్చాను. అక్కడ కుదరలేదు చెప్పడం-మీరు..." ఆగా డతను. "మీ రనడం కుదరడంలేదు నాకు. నువ్వననా?"

మాలతి మాట్లాడలేదు. కారు ఏవేపు పోతుందో చూస్తోం దామె. మరి రెండు నిముషాల్లో పబ్లిక్ గార్డెన్సు లోపలికి వెడుతోంది కారు ఒకప్రక్కన ఆపి, తలుపు తీసి "రా, అల్లా వెడదాం." అన్నా డతను. మంత్రముగ్ధ ఐనట్లు ఆమె అతనితో వెళ్ళింది. చెట్టు నీడన కూర్చున్నా రిద్దరూ.

ఆకుల సందుల్లోంచి నేలమీద పడి, విచిత్రమైన డిజైను కనిపిస్తున్నాయి ఆకుల నీడలు.

"మాలతీ! నువ్వు పెళ్ళి చేసుకుంటావా?" హఠాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నకు మాలతి అతనివంక ఉలిక్కి పడి చూసింది. పెళ్లా?— ఔను. పెళ్ళే! లేకపోతే తనమనస్సు పోతున్న పిచ్చి పోకడకి అర్థ మేమిటి? పెళ్లంటే యింకా ఎన్నో విషయాలు కావాలి అని మొదటిసారిగా స్ఫురించింది. ఈ పిచ్చి ఒకటీ చాలదు.

"ఆశ్చర్యపోతున్నావేం? పెళ్లిఆలోచన లేకపోతే నీకూ, నాకూ మధ్య ఈ బంధనానికి అర్థం ఏమిటి?"

"ఏం బంధన ముంది?" అన్నది మెల్లిగా మాలతి. తనకి తెలీదూ? కానీ - ఎందుకడిగిందా ప్రశ్న?

మాధవరావు నవ్వాడు - కొంచెం ఆగి పకపక నవ్వాడు. చేయి చాచి, ఆమె చేయి పట్టుకున్నాడు.

"ఏం బంధనమో నీకు తెలీదూ? లేడిలా అల్లా కళ్ళు చలిస్తున్నాయేం? నిన్ను చూస్తే నేనెల్లా హాయిగా నవ్వేదీ నీకు తెలీదు! ఏమీ లేకపోతే, నిన్న ప్రొద్దున నా కళ్ళు చూసి, ఏమి అర్థం చేసుకుని పారిపోయావు? ఏ బంధనమూ లేకుండానేనా నీ కళ్ళల్లో ఆ సిగ్గు, నీ ముఖాన ఆ చిలిపినవ్వు?"

మాలతికి తెలుసు. తన బుగ్గలు, చెవులు, కనురెప్పలు ఎల్లా అరుణారుణంగా ఐపోతున్నదీ. అతని వ్రేళ్ళస్పర్శకి, తన శరీరమంతా విద్యుత్తు ప్రవహిస్తోంది. చిగిర్చి, మొగ్గదొడిగిన లతలా ఐపోతోంది శరీరం.

— మరో అరగంటకి నిశ్చయించుకున్నారు తమ పెళ్ళి విషయం. ఆ నాడే యిద్దరూ బయలుదేరి, మాలతివూరు వెళ్ళేటట్లూ మాలతి తండ్రికిచెప్పి, అతనివాళ్ళకి వుత్తరాలు వ్రాసి, ముహూర్తం ఏర్పాటు చేయించేటట్లూ.

ఆ రోజు యిద్దరూ ఆఫీసుకి పోలేదు. టెలిఫోను చేశాడు మాధవరావు అసిస్టెంటు మానేజరుకి. మధ్యాహ్నమంతా మాలతి యింట్లోనే గడిపా రిద్దరూ. సాయంత్రానికి మాధవరావు యింటికి వెళ్ళి, సామాను సర్ది తెచ్చుకున్నాడు.

రాత్రి రైలు కూతపెట్టి బయలుదేరింది. వెనక్కి పరుగెడుతున్న దీపాలవేపు, వీధులవేపు చూస్తోంటే, హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది పద్మావతి. రోజంతా కలవనేలేదు. సాయంత్రం ఆమె తన కోసం ఎదురు చూస్తుందో ఏమో!

ఆ ఆలోచనో క్షణికం! మరుక్షణం అతని కళ్ళల్లోకి చూస్తూ పద్మావతికి ప్రవేశంలేని లోకంలోకి వెళ్ళిపోయింది ఆమె మనస్సు.

*　　　*　　　*　　　*

"మీ అమ్మ ఎవరు?"

"పద్మావతండీ." అన్నాడు వాడు. ఆ అబ్బాయికి ఎనిమిదేళ్ళుంటాయి. గుర్తు పట్టింది మాలతి. పద్మావతి ఆఖరు కొడుకన్నమాట వీడు. అప్పట్లో తప్పటడుగులు వేస్తుండేవాడు.

పిల్లలు ఆటలకి వెళ్ళిన తర్వాత చాల సేపు అల్లాగే కూర్చుండిపోయింది మాలతి. పద్మావతిని తను చూసి చాలకాల మౌతుంది. క్రిందటేడాది సినిమాహాలు దగ్గర కనుపించినప్పుడు, పలుకరించబోతే ముఖం త్రిప్పేసుకుంది ఆమె. మాలతి మనస్సు చివుక్కుమంది. అల్లాంటిది రవి తన కొడుకని తెలిసి కూడా రానిస్తోందే ఆవిడ ఇంటికి?

ఐనా—తను మాత్రం ఎందుకు వెళ్ళనివ్వాలి? ఏ క్షణాన ఏమంటుందో తనని గురించి ఆవిడ పిల్లవాడి ఎదురుగా.

రాత్రి రవితో చెప్పింది మాలతి. "నాన్నా, రేపట్నుంచీ నువ్వు మనింట్లోనే ఆడుకో—వాళ్ళని కూడా యిక్కడికే రమ్మను."

వాడు "ఊహు" అన్నాడు.

"ఏం? ఇక్కడెందుకు వద్దు?" అన్నది మాలతి.

"నేను పెద్దమ్మగారింటికి వెడతా." అన్నాడు వాడు.

"పెద్దమ్మెవరురా?"

వాడు ఒక నిముషం ఆశ్చర్యంగా చూసి, "ఔనులే, పెద్దమ్మ తెలీదుగా నీకు?—రోజూ నాకు బిళ్ళలు పెడుతుంది. ఇంత పెద్ద బిస్కట్లు యిస్తుంది. అమ్మా, పెద్దమ్మవాళ్ళింట్లో కేరంబోర్డు వుందే. నాకు కాయలన్నీ పడిపోతాయి."

ఇంకేమీ అనలేదు మాలతి. రాత్రి అంతా పడుకునే ముందు, రవి లేచి కూర్చున్నాడు.

"అమ్మా, నాకు ఓవల్టీను యిస్తావా" అన్నాడు.

"ఓవల్టీనా? ఇప్పుడేమిటిరా. ఆకలేస్తుందా!"

"లేదు, తాగమని పెద్దమ్మ చెప్పింది." మాలతి మంచంమీద నుంచి లేచి, వాడిదగ్గర కొచ్చింది. "పెద్దమ్మ చెప్పిందీ? ఇంకా ఏం చెప్పిందీ" అన్నది.

"ఇంకానా? రోజూ రాత్రి నిద్దర పోయేటప్పుడు ఓవల్టీను తాగమంది—నేనుకూడా నాన్నలాగా ఐపోతాట. లేకపోతేనే—అమ్మా, పెదనాన్నగారిలాగా సన్నగా, నల్లగా ఐపోతాట."

మాలతి మాధవరావువంక చూసింది. అతను నవ్వాడు. ఆమెకూడా నవ్వొచ్చింది. ఓవల్టీను కలుపుతుంటే, ఆమె మనస్సులో పద్మావతే మెదిలింది. ఇన్నాళ్ళకి ఆమె నవ్వు జ్ఞాపకం వచ్చింది మాలతికి. ఏమిటో! ఆమె ప్రవృత్తి; అర్థం కావడంలేదు.

మర్నాడు ప్రొద్దున్న రవి బట్టలు వేసుకోవడందగ్గర పేచీ పెట్టాడు.

"మల్లెపూవుల్లా వుంటే—యివి వద్దట వాడికి. ఆ దిక్కుమాలిన నీలం నిక్కరు వేసుకుంటా నంటాడు. చూడండి" అన్నది మాలతి భర్తతో.

మాధవరావు రవిని చూశాడు, వాడు పొట్టి తువ్వాలు కట్టుకుని, చూడ్డానికి ముద్దొస్తున్నాడు.

"ఏరా ? అమ్మ చెప్పినట్లు వినవూ ?"

"ఊహూ !" అని అడ్డంగా తలూపాడు వాడు.

"వెధవా ! ఏం ? ఏమొచ్చింది ?"

"పెద్దమ్మ చెప్పింది—తెల్లవి మాసిపోతాయి బడికి వేసుకుంటే-నీలంది వేసుకోమంది. నే నల్లాగే వేసుకుంటా." వా డిష్టప్రకార మే జరిగింది.

ఆ సాయంత్రం యింటికి వస్తూనే తుమ్ముతూ వచ్చాడు రవి. వాడికి జలుబు చేసింది. స్వెట్టరు తొడిగి, సోఫాలో పడుకోబెట్టి, ప్రక్కనే కూర్చుంది మాలతి. పద్మావతి కొడుకు వస్తే రవి ఆడుకోడానికి రాడని చెప్పింది. రవి కళ్ళతోనే వాళ్ళకి చెప్పాడు రానని. వాడి ముఖమంతా భారంగావుంది. ఓపిగ్గాకూడ లేదు, లేవడానికి.

ఏడున్నర ప్రాంతాల వాకిట్లో చెప్పుల చప్పుడైంది. పద్మావతి ! మాలతి లేచి ఎదురు వెళ్ళింది.

"రవికి జ్వరం వచ్చిందా ? ఏడీ ?" అంటూ వచ్చి సోఫాలోనే కూర్చుంది పద్మావతి.

"ఔనమ్మా, కొంచెం వచ్చింది. ఈ రాత్రి కదలనివ్వను."

"రాత్రికి వేడిపాలలో పసుపు, మిరియాలు వేసి త్రాగించేయి. అదే పోతుంది. ఆవిరి పట్టు ముఖానికి." నిన్ననే విడివడినట్లు మాట్లాడుకో గలిగారు యిద్దరూ.

ఆ రాత్రి మాధవరావుకి అన్నం పెడుతూ చెప్పింది మాలతి. పద్మావతి వచ్చి వెళ్ళిందని.

మాధవరావు ఆశ్చర్యంగా చూశాడు. రవిని చూడ్డానికి వచ్చి వెళ్ళిందని చెప్పిందామె. అతనేమీ అనలేదు.

—రాత్రి పదకొండు కావస్తోంది. మాలతి లైటువేసి, రవికి రగ్గు, మఫ్లర్ సరిగా వున్నాయో, లేవో చూసి, మాధవరావు మంచం దగ్గరకు వెళ్ళింది. అతను కళ్ళు తెరచుకొని కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు.

"మాలతీ!" అన్నాడు మెల్లిగా. మాలతి అతని మంచంమీద కూర్చుంది.

"నేను చెప్పనా ఓ విషయం ?" అన్నాడు.

"ఊ!" అన్నది మెల్లిగా.

"పద్మావతి ఎందుకొచ్చిందో తెలుసా మళ్ళీ - నీకు సలహాలిచ్చేది ఆవిడ - ఆవిడ సలహాలు అమూల్యాలని నువ్వు అనుకుని, అన్నీ చేసేదానివి. చీపురుపుల్ల దగ్గర్నించి, సిల్కుచీరె కొనడంవరకు, నీ భోజనం, నీ వ్యవహారం, నువ్వు ఏ మీటింగులకు వెళ్ళాలో, ఎవరి స్నేహం చేయాలో - అన్నీ ఆవిడ నిర్ణయించేది. నువ్వు అడుగు జవదాటక ప్రవర్తించావు, ఔనా ?"

మాలతి తలూపింది చిరునవ్వుతో.

"ఒక్క నా విషయంలోనే ఆవిడ నిన్ను అరికట్టలేకపోయింది. తన సలహా లేకుండా, తన ఎఱికైనా లేకుండా నీ నిర్ణయం నువ్వు చేసుకుని, పెళ్ళి చేసేసుకున్నావు. ఆవిడ అభిమానం దెబ్బతినదూ? —త్రోసి పారేసినట్లు అనిపించదూ?"

మాలతి మళ్ళీ తలూపింది. "నేను అనుకున్నానులెండి అల్లాంటిదే నని" అన్నది.

అతను నవ్వాడు. "అనుకున్నావు?- ఆవిడ నీతో తెగతెంపులు చేసుకుంది - ఆవిడని నువ్వు నిర్లక్ష్యం చేసినప్పుడు, ఇన్నాళ్ళకీనాడు యీ పసి వెధవ నిక్కరు, టవల్లీను అంటూ ఆవిడ సలహాలు పాటిస్తున్నాడు."

మాలతికి నిజంగానే నవ్వొచ్చింది. "ఛీ, ఎందుకండీ, అంత అన్యాయంగా అనేస్తారు ఆవిడని?"

"నిజం—వీడి పెళ్లినాటి వరకూ, పద్మావతి స్నేహం వుంటుంది. తన సలహాలను ఎవరో పాటిస్తున్నారన్న ఆనందం వున్నంత వరకు ఆవిడ స్నేహం వుంటుంది. వీడుకూడా ఆఫీసులో ఏ అమ్మాయినో చూసే వరకు..."

మాలతి క్రొత్తగా సిగ్గుపడింది.

"మా రవి బంగారు తండ్రి. వాళ్ళ నాన్నలా పోకిరీ కాడు." అని లేచింది ఆమె.

ఆ రాత్రి నిద్రపోయేటప్పుడు పద్మావతినే తల్చుకుంది ఆమె. పాపం, ఎంత అమాయక ప్రాణి ఆమె! ఐనా—అంత అమాయక ప్రాణికి, అంత అభిమానం పనికిరాదు అనుకుంది మాలతి.

———